క్లుప్తంగా

వేంకటాద్రి హుండీ లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కింపులో పాల్గొన్న అధికారులు, వేంకటాద్రి సేవకులు

పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీని గురువారం లెక్కించారు. మొత్తం 88 రోజులకుగాను రూ.4,82,589 నగదు, 98 గ్రాముల బంగారం, 9 కిలోల వెండిని వెంకన్నకు భక్తులు సమర్పించినట్లు పర్యవేక్షణాధికారి పి.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. ఈవో నీలిమ ఆధ్వర్యంలో జరిగిన లెక్కింపులో అర్చకుడు మహర్షి శ్రీనివాసాచార్యులు, అధికారులు, వేంకటాద్రి సేవకులు పాల్గొన్నారు. అంతకు ముందు వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాత శివప్రసాద్‌కు బాండ్ అందిస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి విజయనగరానికి చెందిన శివప్రసాద్ గురువారం రూ.లక్ష 116 విరాళాన్ని నగదు రూపంలో ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి అన్నప్రసాద విభాగం ఏఈవో పిల్లా శ్రీనివాసరావు బాండ్ అందించారు. అనంతరం అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం: మండలంలోని సబ్బవరం, అంతకాపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో సబ్బవరం, తవ్వవానిపాలెం, అమృతపురం, గొల్లలపాలెం ,పైడివాడ, అసకపల్లి, ఇరువాడ, గొటివాడ, ఆరిపాక, అంతకాపల్లి, గుల్లేపల్లి, మొగలిపురం , మల్లునాయుడుపాలెం, అయ్యన్నపాలెం, బంగారమ్మపాలెం, ఎల్లుప్పి, వంగలి, గాలిభీమవరం, అడ్డూరు పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకూ విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.

కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా ముక్కా



పెందుర్తి: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా చినముషిడివాడకు చెందిన ముక్క రామునాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ అనకాపల్లి డీసీసీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న ఉత్తర్వులు జారీ చేశారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా రామునాయుడు అన్నారు.

మండల స్థాయి పోషణ్ పక్వాడా రేపు

సబ్బవరం: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 19న మండల స్థాయి పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో లలిత కుమారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్బవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎంపీపీ బోకం సూర్యకుమారి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. వీరితో పాటు వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులను కూడా ఆహ్వానించినట్లు పేర్కొన్నారు.

20న మెగా ఆస్ట్రాలజీ సదస్సు

డాబాగార్డెన్స్: హైదరాబాద్‌కు చెందిన ఎస్ఎస్ లైవ్ ఆస్ట్రో సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 20న సింహాచలంలో మెగా ఆస్ట్రాలజీ సదస్సు నిర్వహించనున్నట్టు సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ నరసింహస్వామి తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతి రాజు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని తెలిపారు. మ్యారేజ్ క్యాపబిలిటీ, జ్యోతిష్య శాస్త్రంలోని యోగాలు, దోషాలు, పరిహారాలపై జ్యోతిష్య పండితులు డాక్టర్ పి. అరుణ్ మహేష్, డాక్టర్ కృష్ణమూర్తి, ఎం. శేషారావు, వి. రమణారావు ప్రసంగిస్తారన్నారు. పాల్గొనదలిచే వారు 7281913456 నంబరులో సంప్రదించాలన్నారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన ఏడుగురికి కోర్టు చెరో రూ.10 వేలు చొప్పున రూ.70 వేలు జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు తెలిపారు. గురువారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కంటి వైద్యానికి కూటమి కాటు

- పెందుర్తి సీహెచ్‌సీలో నిలిచిన నేత్ర వైద్య సేవలు
- కూటమి ప్రభుత్వం వచ్చిన నెల రోజులకే వైద్యశాల మూత
- 9 నెలలు కావస్తున్నా కాంట్రాక్ట్ పునరుద్ధరణకు ఆసక్తి చూపని ప్రభుత్వం
- నిత్యం నిరాశగా వెనుదిరుగుతున్న రోగులు





పెందుర్తిలోని సామాజిక ఆరోగ్య కేంద్రం (ఇన్‌సెట్) ఇక్కడ కంటి వైద్యం ఓపీ లేదంటూ పెట్టిన బోర్డు

'సరిపల్లికి చెందిన ఓ వృద్ధురాలు సన్యాసమ్మకు కంటి పరీక్షలు చేయిద్దామని కుటుంబ సభ్యులు పెందుర్తి సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. కానీ ఇక్కడ అలాంటి సేవలు అందడం లేదని బోర్డు కనిపించింది. ఎందుకు నిలిపివేశారని వారడిగితే.. ఏమో మాకు తెలియదు' అంటూ సిబ్బంది సమాధానం.

'రాజయ్యపేటకు చెందిన సాయికి కంట్లో కర్రపుల్ల గుచ్చుకుందని హుటాహుటిన సీహెచ్‌సీకి వచ్చాడు. కానీ ఇక్కడి వైద్యశాల మూతపడి ఉంది. ప్రథమ చికిత్స అందించే నాథుడూ కనిపించలేదు. దీంతో ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాల్సిన వచ్చిందని అతడు వాపోయాడు.

పెందుర్తి:

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక వైద్యరంగం రోజురోజుకూ నిర్వీర్యం అవుతోందన దానికి ఇంతకంటే ఉదాహరణలక్కర్లేదు..! పెందుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన నేత్ర వైద్యశాల తొమ్మిది నెలల క్రితం మూతపడింది. కంటి సమస్యలకు వైద్యం పొందాలని వచ్చే పదుల సంఖ్యలో రోగులు నిత్యం నిరాశగా వెనుదిరుగుతున్నారు. నిరుపేదలకు సేవలు అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ నేత్ర వైద్యశాల పునరుద్ధరణకు కూటమి ప్రభుత్వం ఎలాంటి ఆసక్తి కనబరచట్లేదు. దీంతో నేత్ర వైద్యం కోసం వస్తున్న వారు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి చేతి చమురు వదిలించుకుంటున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవతో..

అపోలో గ్రూప్‌తో ఒప్పందం ప్రకారం పెందుర్తి సీహెచ్‌సీలో ఐదేళ్ల క్రితం అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నేత్ర వైద్య విభాగాన్ని ప్రారంభించారు. రోజూ దాదాపు 50 ఓపీతో నెలకు వెయ్యిమందికి పైగానే ప్రజలు వచ్చి, కంటి వైద్య సేవలు పొందేవారు. అవసరమైన వారికి ప్రాంతీయ నేత్ర వైద్యశాలకు శస్త్రచికిత్సల కోసం సిఫార్సు చేసేవారు. ఉచితంగా మందులతో పాటు కళ్లద్దాలు కూడా అందించేవారు. బయట రూ.వెయ్యి నుంచి రూ.1,500 వరకు ఖర్చు అయ్యే కంటి పరీక్ష ఇక్కడ ఉచితంగా చేసి, రిపోర్టులు ఇచ్చి దానికి తగ్గ వైద్యం చేసేవారు. ఇలా ఇక్కడి నేత్ర వైద్య విభాగం నిరుపేదల పాలిట వరంగా నడిచేది.



పెందుర్తి సీహెచ్‌సీలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది(ఫైల్)

కూటమి వచ్చింది.. నేత్ర వైద్యశాల పోయింది



పెందుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రంలో మూతపడిన కంటి వైద్యశాల

2024 జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చింది. అదే ఏడాది సెప్టెంబర్ 15తో ఇక్కడ నేత్ర వైద్య విభాగంలో సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆ రోజుతో అపోలో కాంట్రాక్ట్ పూర్తి కావడంతో ప్రభుత్వం సేవలు నిలిపేసింది. సాధారణంగా ప్రజావైద్యంలో ఇలాంటి ఒప్పందాలు ఉన్నప్పుడు గడువుకు ముందుగానే పునరుద్ధరిస్తారు. కానీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఒప్పందం పునరుద్ధరణ కాకపోవడం నిరుపేదలకు శాపంగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఇక్కడ నేత్ర వైద్య విభాగాన్ని పునరుద్ధరించాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నారు



గత ఐదేళ్లు ఇక్కడ కంటి వైద్య సేవలు ఉచితంగా అందించేవారు. కళ్లద్దాలు, ఇతర మందులు ఉచితంగా ఇవ్వడంతో ప్రజలకు ఎంతో మేలు జరిగేది. కానీ తొమ్మిది నెలలుగా ఇక్కడ కంటి వైద్య సేవలు నిలిపి వేయడంతో నిరుపేదలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సీహెచ్‌సీలో సేవలు పునరుద్ధరణ చేయాలి.

– ఎర్ర అప్పారావు, పెందుర్తి

రెండు సార్లు వెనుదిరిగాం



మొన్నటి వరకు ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా నేత్ర వైద్య సేవలు అందేవి. అందుకే మా గ్రామంలోని వారిని ఇక్కడకు తీసుకువచ్చాం. కానీ ఇక్కడ ఓపీ లేదని బోర్డు పెట్టడంతో నిరాశగా వెనుదిరిగాం. మరో ప్రైవేట్ ఆస్పత్రికి వెళితే కంటి పరీక్షలకు, మందులు, కళ్లద్దాలకు రూ.4 వేల వరకు ఖర్చయింది. నిరుపేదలకు ఇది చాలా భారం.

– పి.జగన్, కరకవానిపాలెం

కాంట్రాక్ట్ పునరుద్ధరణకు నివేదించాం



సీహెచ్‌సీలో ప్రస్తుతం కంటి పరీక్షలు నిలిచిపోయాయి. అపోలో గ్రూప్‌తో ఒప్పందం పూర్తి కావడం వలన వైద్యశాలను మూసేశారు. అయితే ప్రజల వినతుల మేరకు మళ్లీ కంటి వైద్య సేవల పునరుద్ధరణ చేయాలని ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వస్తే సేవలు ప్రారంభమవుతాయి.

– డాక్టర్ ఆర్.అవంతి, డీఏఎస్, పెందుర్తి సీహెచ్‌సీ

ఘనంగా దుర్గమాంబ పండగ



దుర్గమాంబను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, పార్టీ నాయకులు

పరవాడ: మండలంలోనిరావాడ శివారు ధర్మారాయుడుపేటలో కొలువైన దుర్గమాంబ పండగ మహోత్సవాలను గ్రామ ప్రజలు గురువారం భక్తి శ్రద్ధలతో జరిపారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు జరిపారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, పార్టీ నాయకులు కావలి రాజు, కావలి వాసు, జమ్ముల అశోక్, పల్లా గోవిందు, కోన రాము అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చి, అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించారు. భక్తుల కోసం ఆలయం వద్ద మంచినీరు, ఉచిత ప్రసాదం ఏర్పాట్లు చేశారు. రాత్రికి అమ్మవారిని డప్పు వాయిద్యాలు, చిడతలు, తప్పెట గుళ్లు, డ్యాన్సులతో పురవీధుల్లో ఊరేగించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భారీ బాణ సంచా వెలుగుల నడుమ అమ్మవారి అనుపు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

ఎక్స్‌పోజర్ విజిట్‌లో విద్యార్థులు



సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులతో సీఐ పిన్నింటి రమణ

సబ్బవరం: విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం, అభ్యాస అంశాలపై అవగాహన పెంచేందుకు ఎక్స్‌పోజర్ విజిట్(సందర్శన) ఎంతగానో దోహదపడుతుందని మండల విద్యాశాఖాధికారి రవీంద్రబాబు అన్నారు. మండలంలో ఎంపిక చేసిన 5 ప్రాథమిక పాఠశాలల నుంచి 5గురు బాలురు, 5గురు బాలికలు కలిపి మొత్తం 10 మంది విద్యార్థులను ఈ ఎక్స్‌పోజర్ విజిట్‌కు ఆయా స్కూళ్ల హెచ్‌ఎంలతో కలిసి గురువారం తీసుకెళ్లారు. విద్యార్థులను మండల కేంద్రంలోని గ్రంథాలయం, పోలీస్ స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఫైర్ స్టేషన్లకు తీసుకెళ్లారు. అక్కడి దైనందిన వ్యవహారాలపై అవగాహన కల్పించారు. గ్రంథాలయ అధికారి శిరీష, స్టేషన్ హౌస్ ఆఫీసర్ పి.రమణ, వైద్యాధికారి ఎం.సత్యదీపిక, ఫైర్ స్టేషన్ ఆఫీసర్ కె.అప్పలనాయుడులు తమ శాఖలకు సంబంధించిన విషయాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ఆయా స్కూళ్ల ఉపాధ్యాయులు ఎస్‌కే అజహరుద్దీన్, బి.పావని, డి.నాగేశ్వరరావు, ఇ.వెంకటరావు, కేవీ రమణ, సీఆర్‌ఎంటీ ఎన్ కళాభారతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల పండగలు

సబ్బవరం: మండలంలోని అమృతపురంలో కొలువైన బంగారమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల పండగ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. వేకువజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవార్లను దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రంగురంగుల విద్యుత్ దీపాలతో అమ్మవారి ఆలయాన్ని ముస్తాబు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. రాత్రి అత్యంత కోలాహలంగా అమ్మవారి అనుపు మహోత్సవం జరిగింది.

గ్యాస్ సబ్సిడీ సొమ్మును బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలి



ధర్నాలో పాల్గొన్న సీపీఎం నాయకులు

గాజువాక : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల సబ్సిడీ సొమ్మును లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో వెంటనే జమ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు గురువారం ధర్నా నిర్వహించారు. పౌరసరఫరాల శాఖ సర్కిల్–3 కార్యాలయంవద్ద మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడారు. దీపావళి నుంచి పేదలకు మూడు వంటగ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, అయితే, పేదలు మాత్రం గత ఏడాది నవంబర్ నుంచి ఇప్పటివరకు లబ్ధిదారులు తమ చేతిడబ్బులు చెల్లించి గ్యాస్ సిలిండర్లను కొనుగోలు చేశారని అన్నారు. అయితే, సబ్సిడీ సొమ్ము మాత్రం ప్రభుత్వం నుంచి అనేకమందికి ఇప్పటివరకు బ్యాంక్ ఖాతాల్లో జమ కాలేదన్నారు. సబ్సిడీ సొమ్ము కోసం ప్రజలు తమ పనులను కూడా మానుకొని అటు బ్యాంకులు, గ్యాస్ ఏజెన్సీలు, అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోతోందన్నారు. తాము ఇటీవల నిర్వహించిన ప్రజాచైతన్య యాత్ర సందర్భంగా ప్రజలు ఈ విషయాన్ని తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. ధర్నా అనంతరం సబ్సిడీ సొమ్ము కోసం ఏఎస్‌వోకు దరఖాస్తులను అందజేశారు.

ఈ సందర్భంగా ఏఎస్‌వో టి.కృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడత వంట గ్యాస్ సబ్సిడీని అందరికీ అందించిందని, రెండో విడత సబ్సిడీ కోసం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. తనకు అందిన దరఖాస్తులపై విచారణ చేపట్టి అర్హులకు సబ్సిడీ డబ్బులు తమ బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యే విధంగా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, నాయకులు కె.పెంటారావు, ఎ.సత్యారావు, ఆర్.విమల, పి.వరలక్ష్మి, పి.రామారావు, బి.జగ్గునాయుడు, ఎస్.వాసు, జి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పండగల్లో జూదమాడితే కఠిన చర్యలు

- పెందుర్తి సీఐ సతీష్‌కుమార్ హెచ్చరిక



సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: గ్రామాల్లో అమ్మవారి పండగలు, ఇతర కార్యక్రమాల్లో, వారాంతాల్లో పేకాట, కోడిపందాలు, గుండాట వంటి జూదమాడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పెందుర్తి సీఐ కె.వి.సతీష్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. హైకోర్టు ఆదేశాల మేరకు పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో పూర్తిగా జూదాన్ని నిషేధించామన్నారు. పండగల్లో అశ్లీల నృత్యాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు కూడా పూర్తిగా నిషిద్ధమన్నారు. అమ్మవార్ల పండగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఐపీఎల్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో బెట్టింగ్ వ్యవహారాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు



అదృశ్యమైన రాణి

పెందుర్తి: చినముషిడివాడ ప్రాంతానికి చెందిన దాలి రాణి(35) అనే మహిళ అదృశ్యమైనట్లు పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. చినముషిడివాడ బంగారమ్మ కాలనీకి చెందిన రాణి ఈ నెల 15న గుడికి వెళ్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. సీఐ కె.వి. సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో హెచ్‌సీ సుమిత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చక్కని వసతులు



పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు ఇస్తున్న ఎంఈవో సువర్ణ

పెందుర్తి: ప్రభుత్వ పాఠశాలల్లో చక్కటి వసతులు ఉన్నాయని మండల విద్యాశాఖ అధికారి కె.సువర్ణ అన్నారు. గురువారం జీవీఎంసీ 95వ వార్డు పరిధిలోని పురుషోత్తపురం, గొల్లవిల్లివానిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల పరిధిలో ఎంఈవో, ఉపాధ్యాయులు పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల గురించి తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. నూతనంగా పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు అడ్మిషన్లు అందించారు. ఉపాధ్యాయుడు, అంగన్‌వాడీ సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.

'ఉపాధి' బకాయిలు చెల్లించాలంటూ నిరసన



నిరసనలో నినాదాలు చేస్తున్న ఉపాధి హామీ పథకం కార్మికులు

పరవాడ: ఉపాధి హామీ పథకం కార్మికుల బకాయి వేతనాలను వెంటనే చెల్లించి, ఆ కుటుంబాలను ఆదుకోవాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. బకాయి వేతనాల చెల్లింపు డిమాండ్‌తో భర్నికం గ్రామంలోని పని ప్రదేశంలో గురువారం కార్మికులు నిరసన చేపట్టారు. పాల్గొన్న గనిశెట్టి మాట్లాడుతూ ఉపాధి పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేసేందుకు కేంద్ర బడ్జెట్‌లో రూ.రెండున్నర లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు 200 రోజుల పనిదినాలు, రోజుకు రూ.600 వేతనం చెల్లిస్తూ, పే స్లిప్‌లు మంజూరు చేయాలన్నారు. కూలీలకు గత కొంత కాలం నుంచి వేతనాలు చెల్లించని కారణంగా వారి కుటుంబాలు పస్తులుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పని ప్రదేశంలో మెడికల్ కిట్లు, టెంట్, మంచినీరు ఏర్పాటు చేయాలన్నారు. తట్ట, పార, గునపాం, టెంట్లు వంటి వాటికి కోత పెట్టడం అన్యాయమన్నారు. రవాణా చార్జీలను ఎత్తివేయడం దురదృష్టకరమని ఆక్షేపించారు. నిరసన కార్యక్రమంలో లక్ష్మి, పార్వతి, అప్పలనర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన ఇంటర్ విద్యార్థులకు సత్కారం



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సత్కరిస్తున్న ప్రజా సంఘాల ప్రతినిధులు

అగనంపూడి: విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం, అధ్యాపకుల అంకితభావంతో అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రతి సంవత్సరం అత్యుత్తమ ఫలితాలు సాధిస్తోందని కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ బాబు అన్నారు.అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇటీవల వెలువడిన ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రజా సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుధాకర్ బాబు మాట్లాడుతూ, జిల్లాలో ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో కళాశాల ద్వితీయ స్థానం , మొదటి సంవత్సరం ఫలితాల్లో తృతీయ స్థానం పొందడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకురాలు గొల్లవిల్లి కనక భవానీ మాట్లాడుతూ, విశాఖ జిల్లాలో అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని కొనియాడారు. కళాశాల స్థాపించిన కొద్ది కాలంలోనే జిల్లా స్థాయిలో వరుసగా రికార్డులు సృష్టిస్తూ రావడం అభినందనీయమన్నారు.అనంతరం, ఎంపీసీ, సీఈసీ, హెచ్ఈసీ మరియు ఒకేషనల్ కోర్సులు అయిన ఈఈటీ, ఎంపీహెచ్‌డబ్ల్యూలలో ప్రథమ స్థానాలు సాధించిన విద్యార్థులను, కళాశాల ప్రిన్సిపాల్‌ను ప్రజా సంఘాల నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, అధ్యాపకులు డి. దివ్య, ఎం. శ్రీదేవి, డి. మంగల, సమీరా, రూతు, అవినాష్, ఆదినారాయణ, శివ నాగేశ్వరరావు, సూర్య ప్రదీప్, ద్రాక్షాయిని మరియు పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు గ్యాస్ సిలిండర్ ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పెదగంట్యాడ: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నడుపూరు జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు, సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక జిల్లా అధికారి ఎస్.గోపీకృష్ణ మాట్లాడుతూ ముఖ్యంగా వేసవిలో అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలు ఇంట్లో వంట చేసే సమయంలో గ్యాస్ సిలిండర్ల వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. ప్రమాదం సంభవించినప్పుడు వెంటనే ఆందోళన చెందకుండా ఆలోచించి వ్యవహరించే పద్ధతులను అగ్నిమాపక సిబ్బంది ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. కార్యక్రమంలో సిబ్బంది జె. జగన్, ఎస్.కె. మీరా సాహెబ్, ఎం. సురేష్, డి. అనిల్, పి. రవి తదితరులు పాల్గొన్నారు.